# విద్యార్థులు-క్రమశిక్షణ

విద్యను అర్థించేవాడు విద్యార్థి. అనగా తనకు జ్ఞానమును కలిగించు విద్యను నేర్చుకొనేవాడు.

క్రమశిక్షణ అంటే కేవలం నోరు మూసుకొని, అల్లరి చేయకుండా మౌనంగా కూర్చోవడం కాదు. నేర్చుకొనే ప్రతి విషయం ఒక క్రమపద్ధతి ప్రకారం నేర్చుకోవటం.

విద్యార్థియొక్క సర్వతోముఖాభివృద్ధికి క్రమశిక్షణ ఎంతో అవసరం. క్రమశిక్షణ విద్యార్థిని ఒత్తిడికి గురిచేయకుండా సృజనాత్మకశక్తిని పెంపొందించి, పరిపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దుతుంది.

విద్యయొక్క పరమప్రయోజనం జ్ఞానార్జన. దీనితోపాటు నేటి పోటీ ప్రపంచంలో విద్యా ప్రయోజనం జీవనోపాధిగా మారింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్గదర్శకులై విద్యార్థుల జీవితాలు క్రమపద్ధతిలో సాగేటట్లు చూడవలెను.

"మొక్కై వంగనిది మ్రానై వంగునా" అన్న సామెతను విద్యార్థులు అవగాహన చేసికొని బాల్యము నుండియే అభివృద్ధికి కృషిచేయాలి. ఏ పనియైనా వాయిదా వేయడం అనేది అలవాటు చేసుకోకూడదు. కార్యసాధనలో పట్టుదల ఉన్నటువంటి విద్యార్థి ఉత్తమ పౌరుడు (ఉత్తమ విద్యార్థి) కాగలడు.

క్రమశిక్షణగల వ్యక్తులు జాతికి మూలస్తంభాలు. "క్రమశిక్షణ లేనివారి జీవితం చుక్కానిలేని నావ వంటిది".మనదేశం రాజకీయంగా, సాంఘికంగా, సాంకేతికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు ఎంతైనా అవసరం.

అందుకే విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే 'ఎన్ జి సి', 'ఎన్ సి సి' వంటివాటిలో చేరి క్రమశిక్షణతోపాటు సంఘసేవను కూడా అలవరచుకోవాలి. క్రమశిక్షణలేని విద్య వాసనలేని పువ్వు వంటిది. వాసనలేని పువ్వు పూజకు పనికిరానట్లే క్రమశిక్షణలేని చదువు వ్యర్థమే.

కావున ప్రతి విద్యార్థి ఈ విషయాన్ని గుర్తించి , క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి.

"నేటి బాలలే రేపటి పౌరులు"